

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ట్రస్మా ప్రతినిధులు

బడ్జెట్ పాఠశాలలకు ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలి

కవాడిగూడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ పాఠశాలలకు ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలని తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని వాటిని నియంత్రించాలని, బడ్జెట్ పాఠశాలలను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, అర్హులైన వారికి గృహ నిర్మాణ స్కీమ్ వర్తింపచేయాలని, ఒక్కొక్కరికి 250 గజాల చొప్పున స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో ట్రస్మా కోశాధికారి కె. శ్రీకాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధి చింతల రాంచందర్, పీజే రెడ్డి, ఎస్. శేఖర్‌రెడ్డి, కె.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ముషీరాబాద్ నేతలు

ముషీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తేజా గౌడ్, ఇందిరాశోభన్ ఆధ్వర్యంలో కాగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో రవికిరణ్, ప్రభుగౌతం, రాహుల్ తదితరులు ఉన్నారు.



లాడ్జీల నిర్వాహకులతో సమావేశమైన ఏసీపీ రమేశ్‌కుమార్

లాడ్జీల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి : ఏసీపీ

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో లాడ్జీల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏసీపీ ఎల్. రమేశ్‌కుమార్ సూచించారు. సోమవారం చిక్కడపల్లి, ముషీరాబాద్ పీఎస్‌ల పరిధుల్లోని లాడ్జీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో అసాంఘిక శక్తులు లాడ్జీల్లో మకాం వేసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లాడ్జీల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ముషీరాబాద్ అడ్మిన్ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు సీనియర్ నాయకుడు సోమన్ రాజీనామా



ముషీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు సీనియర్ నాయకుడు టి. సోమన్ రాజీనామా చేశారు. పార్టీలో గుర్తింపు, ఆదరణ లేకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల నుంచి పార్టీలో పనిచేస్తున్నానని, శాసనసభ ఎన్నికల్లో ముఠా గోపాల్ గెలుపునకు, పార్టీ అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టికెట్ కేటాయింపులో తనకు అన్యాయం చేశారని ఆయన అన్నారు.

నేటి వరకూ శ్రీరామకథ, మహాయజ్ఞ కార్యక్రమం

బర్కత్‌పుర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 17న శ్రీరామ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆర్యసమాజ్ అఖండ భారత్ సేన అధ్యక్షుడు విజయపాల్‌యాదవ్ తెలిపారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని ఈనెల 16వ తేదీ వరకు శ్రీరామకథ, మహాయజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం కాచిగూడ చప్పల్‌బజార్‌లో నిర్వహించిన మహాయజ్ఞ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధరమ్‌పాల్‌యాదవ్, సత్యపాల్‌యాదవ్, అశ్వినీయాదవ్, అజయ్‌పాల్‌యాదవ్, యశ్‌పాల్‌యాదవ్, అభినవ్ మిత్ర తదితరులు పాల్గొన్నారు.



బుర్రా లక్ష్మీనారాయణ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు

మానవతా విలువల పెంపునకు

బుర్రా లక్ష్మీనారాయణ కథలు దోహదం

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మంచిని పెంచడానికి, మానవతా విలువలను పెంపొందించడానికి బుర్రా లక్ష్మీనారాయణ కవిత్వం, కథలు దోహదపడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో బుర్రా లక్ష్మీనారాయణ సంస్మరణార్థం పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సభ జరిగింది. డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ కవి ఏనుగు నర్సింహారెడ్డి, కెవీఎస్ వర్మ, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, గుడిపాటి, జయంతి నాగేశ్వరరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొని మాట్లాడారు. రెండు కవితా, ఆరు కథా సంపుటాలు వెలువరించిన లక్ష్మీనారాయణ సాహిత్యం సమాజంలో నెలకొన్న పెడధోరణులను చర్చకు పెట్టిందన్నారు.

నేడు కాంగ్రెస్ బూత్‌స్థాయి సమావేశం

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం బూత్‌స్థాయి కమిటీసభ్యుల సమావేశాన్ని జయప్రదం చేయాలని గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ పిలుపునిచ్చారు. సోమవారం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో సీనియర్‌నేతలతో సమావేశం జరిగింది. కెన్నడీ మాట్లాడుతూ.. మంగళవారం ముషీరాబాద్ కషిష్ ఫంక్షన్‌హాల్‌లో బూత్‌స్థాయి కమిటీ సభ్యుల సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు మారిశెట్టి నర్సింగ్‌రావు, యాదగిరిగౌడ్, జయేందర్‌బాబు, శీలం సత్యనారాయణ, మధుమతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒడియా ఉగాది వేడుకలు

ముషీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ దేవుని తోటలో భవానీశంకర ఆలయ ప్రాంగణంలో నితాయి గౌర్ పూజా సంగ్ ఆధ్వర్యంలో ఒడియా ఉగాది వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ మహంకాళి దేవాలయ ప్రధాన పూజారి చంద్రమౌళి, ఉత్సవ నిర్వాహకులు ఏకే నాయక్, అజయ్‌మాలిక్, సుభాష్ సాహూ, ప్రభాకర్, రంజన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ తదితరులు

మోదీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లండి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



బసంత్‌కాలనీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనను మరోసారి కోరుకుంటున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం కాచిగూడ డివిజన్ బసంత్ కాలనీ, కాశీరాంజీరా ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. అనంతరం బసంత్‌కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత లోక్‌సభ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలు తనకు 48 వేల ఓట్ల మెజారిటీ అందించారని, ఈసారి లక్ష ఓట్ల మెజారిటీ ఇవ్వాలని కోరారు. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి ఎ. సూర్యప్రకాష్‌సింగ్, నాయకులు ఎక్కాల కన్నా, కృష్ణకుమార్, సుభాష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడుతున్న కావ్యాకిషన్‌రెడ్డి

అపార్ట్‌మెంట్ వాసులు బీజేపీకి అండగా నిలవాలి

నల్లకుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అపార్ట్‌మెంట్ వాసులు బీజేపీకి అండగా నిలవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి కోరారు. సోమవారం నల్లకుంట డివిజన్‌లో జయశేఖర, గాయత్రి తదితర అపార్ట్‌మెంట్‌వాసుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి చేసిన సేవలను గుర్తించి ఆయనకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎం.మధుసూదన్‌యాదవ్, అపార్ట్‌మెంట్‌వాసులు రాజశేఖర్‌రెడ్డి, సుదర్శన్, వినోద్, ప్రవీణ్, రాము, శ్రీనివాస్, మహిత, రామకృష్ణ, రవీందర్, కరుణ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

అంబర్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్ కార్యకర్తలను కోరారు. అంబర్‌పేట డివిజన్ 145 బూత్ కమిటీ సమావేశం సోమవారం ప్రేమ్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీరప్ప, నారాయణ, రమేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్



ఓటరుకు ఎన్నికల కరపత్రం అందజేస్తున్న డా. లక్ష్మణ్

దేశ భవిష్యత్, ప్రజల ఆకాంక్ష నెరవేర్చేందుకే

మోదీ సంకల్ప పత్రం విడుదల

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ కోసం, ప్రజల ఆకాంక్ష నెరవేర్చేందుకు ప్రధాని మోదీ సంకల్ప పత్రం విడుదల చేశారని ఎంపీ డా. కె. లక్ష్మణ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు నిర్వహించిన విజయ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి బీజేపీ.. ఎన్నికల క్యాంపెయిన్ గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ స్ట్రీట్‌నెంబర్ 4లో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ఎన్నికల కరపత్రాన్ని అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ విడుదల చేసిన సంకల్ప పత్రం 2047 వరకు దేశం అభివృద్ధి చెందినదిగా నిలిపేందుకని అన్నారు. మోదీ ప్రభంజనాన్ని తట్టుకోలేక కాంగ్రెస్, బీఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా బూటకపు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి మరోసారి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, బూత్ 271 అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కవులు, కళాకారులకు తెలంగాణ పుట్టినిల్లు



డాక్టర్ నాగరాజు సురేంద్రను సత్కరిస్తున్న వేణుమాధవ్ తదితరులు

నల్లకుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులు, సాహితీవేత్తలకు తెలంగాణ పుట్టినిల్లు వంటిదని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణు మాధవ్ అన్నారు. ప్రస్తుత సమాజంలో సాహిత్యంపై మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా సాహితీవేత్తలు కృషిచేయాలన్నారు. సోమవారం నల్లకుంట నర్మదా భవన్‌లో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నాగరాజు సురేంద్ర (ఎలనాగ)కు ఆత్మీయ సత్కారం, క్రోధినామ సంవత్సరం ఉగాది కవి సమ్మేళనం జరిగింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. డా. నాగరాజు సురేంద్ర భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు కవులు అమ్మంగి వేణుగోపాల్, కందుకూరి. శ్రీరాములు, దాస్యం సేనాధిపతి, దేవకిదేవి, సుదర్శన వేణు, గణవెల్లి దశరథ రామయ్య, కందుకూరి శ్రీరాములు, కూర్మాచలం శంకరస్వామి తదితరులను సత్కరించారు. కవి సమ్మేళనంలో పలువురు కవులు తమ కవితా గానంతో ఆహూతుల ప్రశంసలందుకున్నారు.

కార్యక్రమంలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తులసి సత్యనారాయణ, బిక్కుమల్ల నిర్మల, ప్రధాన కార్యదర్శి వెంకటయోగి వెంకటేశ్వర్లు, కోశాధికారి తిరుక్కవల్లూరు కృష్ణస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి వరివేద వెంకటేశ్వరరావు, ప్రచార కార్యదర్శి తిరునగరి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు వరంగల్, కంటోన్మెంట్ టికెట్ కేటాయించకపోతే

17 ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను నిలబెడతాం



మాట్లాడుతున్న పోకల కిరణ్‌కుమార్ మాదిగ

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు వరంగల్ ఎంపీ సీటు, కంటోన్మెంట్ అసెంబ్లీ టికెట్ కేటాయిస్తూ ఈనెల 18వ తేదీలోపు కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ప్రకటించకపోతే మాదిగ సంఘాల మహాకూటమి తరపున 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెడతామని మహాకూటమి కన్వీనర్ పోకల కిరణ్‌కుమార్ మాదిగ హెచ్చరించారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి సమావేశం జరిగింది.

సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మాదిగలకంటే తక్కువ జనాభా ఉన్న మాలలకు మూడు ఎంపీ సీట్లు, కంటోన్మెంట్ టికెట్ కేటాయించి మాదిగలకు అన్యాయం చేశారని ఆరోపించారు. మాదిగ జాతి పేరుతో మూడు దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ బీజేపీ, ఇతర పార్టీలకు కొమ్ము కాస్తూ జాతికి తీరని అన్యాయం చేశారని అన్నారు. ఏబీసీడీ వర్గీకరణ జరగాలంటే చట్టసభలలో మాదిగల ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగలకు అన్యాయం చేస్తున్న పార్టీలు, నాయకులను తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మహాకూటమి నాయకులు బి.ఎన్. రమేష్, శ్రీనివాస్, పల్లెల వీరస్వామి, గడ్డ యాదయ్య, మాస్టార్జీ, రాజలింగం, లాయర్ మల్లయ్య, రవీందర్, ప్రేమ్‌కుమార్, శివ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్టీని తూప్రాన్‌కు తరలించడం అన్యాయం



వీఎస్టీ కంపెనీ గేట్ వద్ద మాట్లాడుతున్న చంద్రశేఖర్

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ కంపెనీని తూప్రాన్‌కు తరలించడం అన్యాయమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం వీఎస్టీ వర్కర్స్ ఐఎన్‌టీయూసీ విభాగం కార్మిక నాయకులు కె. రాజు, ఎల్. డి. పాల్ ఆధ్వర్యంలో కంపెనీ గేట్ వద్ద నిరసన తెలిపారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కంపెనీని తూప్రాన్‌కు తరలించడం వల్ల కార్మికులు నిత్యం వంద కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీఎస్టీ యాజమాన్యం కార్మిక నిబంధనలను తుంగలో తొక్కి కంపెనీని ఆజామాబాద్ నుంచి తూప్రాన్‌కు తరలించిందని ఆరోపించారు. కంపెనీని తరలించిన నేపథ్యంలో 2 లక్షల రూపాయల నగదు బెనిఫిట్, ఆరు ఇంక్రిమెంట్లు, ప్రతినెల కార్మికుడికి రూ. 6 వేలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంపెనీ యాజమాన్యం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు.

నిరసన కార్యక్రమంలో వీఎస్టీ కార్మిక నాయకులు నాగేష్, సమ్మద్, ప్రవీణ్‌కుమార్, పద్మారెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారగ్రహీతలతో రమణాచారి

వైకే నాగేశ్వరరావు అసామాన్యుడు

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తూ యువకళావాహిని సంస్థను సమర్థవంతంగా నిర్వహించిన వైకే నాగేశ్వరరావు అసామాన్యుడు అని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. ఐకే నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా సోమవారం త్యాగరాయగానసభలో ఆయన పేరిట స్మారక పురస్కారాలను రంగస్థల నటులు కేఆర్‌కే మూర్తి, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ సంజయ్‌కిషోర్, సినీనటి భార్గవి, నటులు గోవాడ వెంకట్, ఎస్ఎం బాషాకు రమణాచారి బహూకరించారు. సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ.. నాగేశ్వరరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. డా. చెన్నయ్య, అంజిబాబు, కేవీ కృష్ణకుమారి, రఫీ, సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యూక్లియర్ వైద్యవిధానంలో ప్రతిభాశీలి జ్యోత్స్న

న్యూక్లియర్ వైద్యవిధానంలో ప్రతిభాశీలి డా. జ్యోత్స్న అని ప్రముఖులు ప్రశంసించారు. రాగసప్తస్వరమ్ ఆధ్వర్యంలో సీల్‌వెల్ కార్పొరేషన్ సౌజన్యంతో వెబ్‌సిటీ కన్సల్టెంట్ డా. జ్యోత్స్నకు ఉగాది పురస్కార ప్రదానసభ సోమవారం జరిగింది. జ్యోత్స్నను దూరదర్శన్ మాజీ డైరెక్టర్ జనరల్ అనంతపద్మనాభరావు సత్కరించారు. విద్యావేత్త మంగళ గౌరి, కాంగ్రెస్ నేత శ్రీమణి, సంస్థ స్థాపకులు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి మంగళస్నానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం సీతారామచంద్రస్వామి, సీతమ్మకు పెళ్లి కొడుకు-పెళ్లి కూతురు అలంకరణ నిర్వహించారు. ఉదయం సీతారామచంద్రస్వామికి మంగళస్నానం చేయించారు.

26 నుంచి ఉచిత సమ్మర్ క్యాంప్

బ్రహ్మకుమారి కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మూడురోజులపాటు పిల్లల కోసం ఉచిత సమ్మర్‌క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల వారు వాట్సాప్ నంబర్ 9396523408లో సంప్రదించవచ్చని కేంద్రం ఇన్‌చార్జి జయశ్రీ కోరారు.

దుర్భాషలాడిన వ్యక్తికి రెండు రోజుల జైలు

దుర్భాషలాడిన వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించింది. చిక్కడపల్లికి చెందిన టి. లక్ష్మీనారాయణ ఫొటోగ్రాఫర్. ఈవెంట్ ఫొటోగ్రఫీ డబ్బుల విషయంలో శివశంకర్ అనే వ్యక్తితో గొడవపడ్డాడు. దుర్భాషలాడి చేయిచేసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు లక్ష్మీనారాయణపై పోలీసులు కేసు నమోదు చేసి నాంపల్లి 15 ఎంఎం ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. కేసును విచారించిన న్యాయాధికారి లక్ష్మీనారాయణకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి మృతి

ముషీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కేఎల్ పండరీనాథ్ (పాండు)(72) సోమవారం మృతి చెందాడు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రఫుల్ రాంరెడ్డి తదితరులు పాండు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పద్మారావుగౌడ్ గెలుపునకు కార్యకర్తలు కృషిచేయాలి

అంబర్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ గెలుపునకు పార్టీ కార్యకర్తలందరూ సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సోమవారం చెన్నారెడ్డినగర్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్ అంబర్‌పేట అభివృద్ధి కోసం చేసిన పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, రాగుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాషాయ జెండాల పంపిణీ

గోల్నాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకొని సోమవారం గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీలో బీజేపీ సీనియర్ నాయకుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాషాయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా అంబర్‌పేట నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.అనిల్‌చారి, నాయకులు బి.వినోద్, అనూప్, పి. విఘ్నేష్, ఎ. అనిల్‌చారి, పి. సుదర్శన్, నరేష్, నరేందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

'మైనార్టీలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలి'

బర్కత్‌పుర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మైనార్టీలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి కోరారు. సోమవారం క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి శ్రీరంగం లింగాల, క్రిస్టియన్ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సుహాసిని తదితరులు ఆయనను కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వాల విధానాలు



మాట్లాడుతున్న రాంబాబుయాదవ్

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబుయాదవ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికుల సత్తా చూపించే విధంగా మేడే వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో బీఆర్‌యూ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను బీజేపీ రద్దు చేసి యజమానులకు అనుకూలంగా చట్టాలను తీసుకొచ్చిందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగులను విస్మరిస్తోందన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలకు నెలవారీగా వేతనాలు సరిగా అందడం లేదన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో కనీస వేతనాల మండలి మాజీ చైర్మన్ పి. నారాయణ, బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వేముల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జి కాంగ్రెస్‌లో చేరిక

ముషీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జి పోచగారి నరేందర్ ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ తరుపున ముషీరాబాద్ అభ్యర్థిగా నరేందర్ పోటీ చేశారు. బీఎస్పీలో ఆదరణ లేకపోవడంతో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన నరేందర్ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పనిచేశారు.



విద్యుత్ లేని తరగతి గదిలో విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

- చీకట్లోనే పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

బోయినపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో కరెంట్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లోనే పరీక్షలు రాస్తున్నారు. పాఠశాలకు కరెంట్ నిలిపివేసి ఐదురోజులైనా ప్రిన్సిపాల్ స్పందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. స్థానిక నాయకులు కొందరు ఎంతఈవోకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.